21. ఏదీ మీ జవాబు?

ఎంతపని చేశారు మేస్త్రిగారూ మీరు!

నా కొంప నేలమట్టం చేసేశారు!

నా ఆశలన్నీ పాతాళానికి అణిచేశారు!

మీరంటే యిప్పటికీ గౌరవం వదలుకోలేనందుకు దుఃఖపడుతున్నాను. మీరంటే యిప్పటికీ అభిమానం చంపుకోలేనందుకు బాధపడుతున్నాను. ఇంత అన్యాయం చేస్తారా! అని మిమ్మల్ని అడగడానికి వస్తే 'నువ్వు చేసిందే అన్యాయం, నేను చేసిందే న్యాయం' అని తీర్పుచెప్పేరు. అలాగా!

అసలు న్యాయమంటే ఏమిటో కొంచెం నిర్వచించండి విందాం. నీతి అంటే ఏమిటో చెప్పండి, ఎప్పటికయినా తెలుసుకుందాం.

'మనసా వాచా కర్మణా ఎక్కడా కల్మషం అన్నది కలవకుండా జీవించడమే మానవ ధర్మం. అదే న్యాయం'

అని మీరే ఏదో సందర్భంలో చెప్పినట్టు గుర్తు.

కల్మషం కలవకుండా జీవించడం సాధ్యమే అంటారా?

ఇంతవరకూ వచ్చాక యింకా వెనుదియ్యడం ఎందుకు, అడిగేస్తున్నాను. ఆలోచించి చూడండి.

కల్మషం కలవకుండా జీవించగలుగుతున్నారా మీరు?

మీరు పీల్చేగాలి మీ యింటి ముందు మురుగుకాలవమీద నుంచి వస్తోంది. మీకు లభించే సూర్యకాంతి ఫేక్టరీ పొగల మేఘాలతో ఉక్కిరి బిక్కిరై అంతస్థుల కత్తెరబోనుల్లో ముక్క ముక్కలై చెల్లా చెదురుగా దొరుకుతోంది. మీకు తాగడానికి గాని వాడడడానికి గాని అంత సుళువుగా మంచినీళ్ళు దొరకవు, నాకు తెలుసు. పాలలో మందుల్లో కలపడానికే ఎక్కడ లేని నీళ్ళూ చాలకపోతే మీకెలా దొరుకుతాయి? దొరికినా అందులో ఇంపుకన్న కంపు ఎక్కువ. మీరు తినే బియ్యంలో, పప్పుల్లో రాళ్ళు సరేసరి. పంచదారతో సహా సూపర్‌ఫైను చెరుకు పిప్పి కలుపుతున్నారని మీకు తెలుసు.

పంచభూతాలే కల్తీయై పాపభూయిష్ఠం అయిపోయాయే, నిష్కల్మషంగా ఎలా బతుకుతున్నారు సార్ మీరు?

మరెక్కడుందండీ న్యాయం!

బ్లాక్ మార్కెట్‌లోగాని పాలడబ్బాలు దొరకని రోజున ఏం చేశారు మీరు, నాలుగు తన్ని మీ పాపల్ని పడుకోపెట్టగలిగేరా? బ్లాక్‌లో తెచ్చుకోలేదూ!

లోకంలో యింతగా 'కరప్షన్' పెరిగిపోతున్నప్పుడు, యింతగా 'బిజినేస్ మైండెడ్‌నెస్' అభివృద్ధి చెందుతున్నప్పుడు సందర్భానుసారం రోజుకో రంగు పులుముకునే దాన్నే న్యాయం అంటారు.

టేకిట్ ఫ్రమ్ మీ.

మీకు యిష్టమైనవి ధర్మాలూ, మీరు అనుసరించడానికి మాత్రమే వీలయ్యేవి ధర్మసూక్ష్మాలూ అనిపించుకోవు సార్.

'యథాశక్తి పాత్రను పోషించారు' అన్నది విధి నిర్వహణ అవదుసార్.....

'అందరికీ ఒకలాంటి న్యాయం జరగకపోడమే ఈనాటి న్యాయం. అదే నేనూ చేశాను' అని మీరంటే మళ్ళీ మాటాడను నేను. నిష్పక్షపాత బుద్ధితో పని చేస్తున్నామని చెప్పుకునే మన పత్రికల కొన్నిటి స్థితే జాగర్తగా గమనించండి.

పుస్తకాల విమర్శలు అనే పేజీ తిరగెయ్యండి. దూది ఏకినట్టు ఏకిపారేస్తున్నారు మంచిదే. చెడు ఉంటే చెండాడవలసిందే. అదే పత్రికలో 'చిత్రసమీక్ష' పేజీ కొంచెం చూడండి. ఎంత దరిద్రగొట్టు సినిమా అయినా సరే 'గొప్ప పనితనం చూపించబడి, మొదటి నుంచి చివరకు గొప్ప ఉత్కంఠ పోషింపబడి, కథలోను, కథనంలోను ఎంతో నవ్యత చూపించబడి, కడుపుబ్బ హాస్యం సృష్టించబడి సందేశాత్మకంగా' ఉంటుంది!

ఎడ్వర్‌టైజ్‌మెంట్సు సంపాదించుకోడం కోసం ఇవి తప్పవు. వారి ప్రతాపమంతా పూర్ హెల్ప్ లెస్ రైటర్స్ పుస్తకాల మీదే.

న్యాయాన్యాయ విచారణ ఎత్తి చూపడానికి యీ ఉదాహరణ యిచ్చాను.

కేర్‌ఫుల్‌గా స్టడీ చేస్తే రోజుకి కొన్ని వందలు యివ్వొచ్చు.

కాని అనవసరం.

ఇంతవరకూ నా గుండె అసలు విషయానికి సంబంధించని అనేక విషయాలు వెళ్ళగక్కింది.

నౌ, కమింగ్ టు ది పాయింట్.

నాకు మా మేనమామ కూతురు సరోజని చేసుకోవాలనుంది.

దానికీ నన్ను చేసుకోవాలనుంది.

అయితే మా యిద్దరికీ ఒకర్నొకరం దోచుకోడం, మనసుల్ని కొల్లగొట్టడం యిలాంటివే కాక యింకా కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలున్నాయి.

సుఖపడాలి మేము.

సుఖపడాలంటే బాగా డబ్బుండాలి మాకు.

బాగా డబ్బుండాలంటే సరోజ, వాళ్ళ నాన్న చేత బాగా పెద్ద మొత్తంలో కట్నం యిప్పించాలి నాకు.

కట్నం ఇప్పించాలంటే ఆయన దృష్టిలో డాక్టరు చదువులోనే అడుగుపెట్టాలి. డాక్టరు చదవాలంటే పియ్యూసీలో బయాలజీ గ్రూపు తీసుకోవాలి. తీసుకోవడమే కాదు బాగా హై పెర్సంటేజి మార్కులు రావాలి. అదిగో అక్కడే గొంతుక నొక్కేశారు మేష్టారూ మీరు. ఒక్క మాటలో నాశనం చేసి పారేశారు.

జువాలజీ పేపరేమో ఈజీగానే ఉంది.

చాలా బాగానే రాశాను కూడా.

బాటనీ పేపర్ చాలా కష్టంగానూ, కోర్స్‌లో లేని ప్రశ్నలతోనూ ఉంది.

ఆ పేపరిచ్చినవారికి ఆమాత్రం బుద్ధి ఉండక్కర్లేదా?

మాట వరసకి, మా పియ్యూసీవాళ్ళం యీ గ్రూపు వాళ్లం పదివేల మంది ఉన్నామనుకొందాం. ఒక్కొక్క కేండిడేటుకి స్నేహితులు గాని బంధువులుగాని సగటున నలుగుర్ని వేసుకుందాం.

అంటే అలాంటి 'దిక్కుమాలిన పేపరిచ్చిన ఆ మహానుభావుణ్ని' ఆ రోజు ఎంత మంది తిడతారు?

ఏభైవేలన్నమాట, అవునా?

ఆ తిట్టిన వారిలో ఏ ఒక్కరికి వాక్శుద్ధి ఉన్నా ఆ పేపరిచ్చిన పెద్ద మనిషి పెళ్ళాం పుస్తె పుటుక్కున తెగిపోదూ?

ఆ మాత్రం జ్ఞానముండొద్దా అంత అనుభవం ఉండే ఆ అయ్యవారికి?

ప్రిపరేషన్‌లో నాది ఏ లోపమూ లేదు. నమ్మండి.అసలు ప్రిపరేషన్ ఎంత కష్టమో, 'అత్తా ఒకింటి కోడలే అన్నట్టు' 'మేష్టరూ ఒకనాటి స్టూడెంటే' అని మీకు తెలియదు గనకనా?

బోటనీ బుక్కు ముందేసుకు కూచుంటే నాకేం జ్ఞాపకమొస్తాయో మీకు చెప్పనా ఇదిగో ఇదే.

మా అమ్మ 'సుప్రభాతం' అర్ధం చెప్పించుకుంటూ ఉంటుందిలెండి. శలవలికి యింటికెళ్ళినప్పుడు విన్నాను, అందులో ఓ ముక్క 'కాంతా కుచాంబురుహ కుట్మల లోలదృష్టే' అనగా? ప్రియురాలి తామర మొగ్గల వంటి కుచములయందు ఆసక్తమైన దృష్టి గలవాడా! నేను కళ్ళు మూసుకుంటే నాకేం కనపడతాయో తెలుసా? ఇవిగో ఇవే! ముమ్ముమ్ముమ్ముమ్మద్దంటే చేదా? నీకా ఉద్దేశం లేదా? అని పాడుతున్నప్పుడు సెక్సీగా తిరుగుతున్న జయలలిత పెదిమలు. మనసంతా చిచ్చు బుడ్డిలా జ్వలించిపోతూంటే అందులో బాటనీ అనే పచ్చ గడ్డి ఏం నిలబడుతుంది చెప్పండి?

అయినా నేనెంత కంట్రోలు చేసుకున్నానో ఆ సరోజకే ఎరుక. ఇనప కచ్చడాలు కట్టిన ముని ముచ్చులే చిత్తయిపోతే యీ యిరవైయో శతాబ్దంలో మొన్న మొన్న షేవింగు మొదలెట్టిన పసివాడిని నన్నెంతకని చావమన్నారు చెప్పండి!

మా యువతరాల మనసు ఏలేవి, దిక్కుమాలిన టెక్స్టుబుక్కులు కాదు. వీలయినంతవరకు బట్టల పొదుపు చేసే అంటే పైన అరగజం కింద పావు గజం మాత్రమే వాడే సుందర సినీతారలే. వీరే మమ్మేలు యువరాణులు.

పోనీ, మాకు పాఠాలు చెప్పే లెక్చెరర్లు!
కాపీకొట్టి డిగ్రీలు తెచ్చుకున్నవాళ్లు
కాళ్లు పట్టి డాక్టరేట్సు కొట్టుకొచ్చిన వాళ్లు
గైడ్సుచదివి ప్రిపేరై పాఠాలు చెప్పే వాళ్ళు,

అందరూ కాకపోవచ్చు కాని ఎందరో అందులో మహానుభావులు!

ఇక మా హాస్టల్సు ఎంత బాగా నిర్వహింపబడుతున్నాయో ఒక్కసారి వచ్చి చూడండి. ఏ రూం కయినా సరే.

ప్రతీ అలమారలోనూ నిలువెత్తు వెంకట్రమణమూర్తి పటం జారబెట్టి ఉంటుంది. దాని వెనక చెయ్యి పెట్టి ఇవతలికి లాగండి.

భయపడకండి. ఇదేం రహస్యం కాదు.

చుక్కేసుకుంటే చుక్కల్ని చూపించే స్కాచ్ సరుకు సీసా దొరుకుతుంది. కలియుగదైవం ఆ ప్రభువుకి కలిగినవాడు చేసే నిత్య నైవేద్యం యీ మధువు.

ఆరగింపు పెట్టి గుర్రున త్రేన్పందే ఏ రోజూ మాకు మొదలయినట్టుండదు. ఇన్ని ఆకర్షణలతో ఎంత కష్టపడి చదివానో నాకేం యిచ్చినా మీలాంటి విద్యావేత్తల రుణం తీరదు.

పొట్టులాంటి ఆ సరుకు ఎలాగో బుర్రలోకి ఎక్కించుకున్నాను. ఆంజనేయ స్వామిని తలచుకుని పరీక్ష హాలులో కళ్ళు తెరిచాను.

ఏమిటిది!

బాటనీ పేపరు ఇలా ఉందేమిటి?

రోజా రమణిలా ఉంటుందనుకున్నాను.

రుష్యేంద్రమణిలా ఉంది! అంతేకాదు ఇంకేది దారి నాకు?

అనుకున్న ఒక్క ప్రశ్నా లేదు. ఏం చెయ్యాలిప్పుడు?

మానవ మాత్రులం, సంసార పక్షంగా జీవించాలనుకునేవాళ్ళం.

'కష్టాలు మనుషులకి రాకపోతే మానులకి వస్తాయా'! అని ధైర్యం తెచ్చుకున్నాను. అత్యవసర పరిస్థితి ప్రకటించింది నా మనస్సు.

ఆపద్ధర్మంగా ఏం చేసినా తప్పు లేదని హెచ్చరించింది నా బుద్ధి.

వంశం నిలుపుకోడం కోసం కులస్త్రీలకి పరాయి పురుషుడి పక్కలో పడుకున్నా తప్పులేనప్పుడు, పరీక్ష మరీ కష్టంగా ఉన్నప్పుడు ప్యాసుకావడంకోసం అయినింటి విద్యార్థికి, పక్కనున్న వాడి పేపర్లో తొంగిచూసి కాపీకొట్టడం మనుషుల రక్తంలో ఉంది. చూసి నేర్చుకోనిదీ పెద్దల్ని చూసి పోల్చుకోనిదీ....... పిల్లలు ఆ విధంగా అనుకరించనిదే ఎటువంటి ఎదుగుదలా ఉండదు. అంతవరకు ఎందుకు? తల్లిపిట్ట, పిల్లపిట్టకి యిచ్చే ఫస్ట్ లెసన్ ఏమిటి? అందరూ ఎదుగుతున్నారే. వెర్రిబాగులకూనా! నువ్వూ వాళ్ళని చూసి కాపీ కొట్టి ఎగరడం నేర్చుకోవేం అని కాదా? కాపీ తియ్యవలసినవ అవసరమే లేకపోతే టైపురైటర్లు ఉండవు. పుస్తకాల కాపీలు ఉండవు. ఉద్యోగాలూ ఉండవు. 'బుద్ధిమంతుల అడుగుజాలలో నడువు' అని తమ బోంట్లే శలవిస్తారు. నా ఎదుటి సీటులో కూచున్న గంగాధరం ఎంతో బుద్ధిమంతుడు. ఫస్టు మార్కులన్నీ వాడివే.

వాడిని చూసి, వాడు రాసిందే రాసి బాగుపడదామని సద్బుద్ధితో కాపీకొట్టడానికి ప్రయత్నిస్తే నన్ను పట్టుకున్నారే. యిదేం దుర్బుద్ధి సార్ మీకు? అదిగాక ఏ పద్ధతికయినా మొదలన్నది ఎక్కడో

ఉండివుండాలి, మన పెద్దలు చేసుకున్న పుణ్యంవల్ల, ఎవరో ఎప్పుడో మహానుభావుడు యీ కాపీకొట్టే పద్ధతి ప్రవేశపెట్టి ఉండాలి.

నిజంగా ఆ పద్ధతిలోనే మీరు చెప్పినట్టు తీవ్రమైన లోపం ఉండివుంటే ఇన్నాళ్ళపాటు మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఇంతగా దేశ వ్యాప్తంగా అల్లుకుని ఉండేదంటారా?

లోకువగా దొరికేను గనుక నన్ను పట్టుకోగలిగారు మీరు.

మా రూంలో నాకు నాలుగు సీట్ల అవతల వైస్ ప్రెసిడెంట్ తమ్ముడు పుస్తకం దగ్గిర పెట్టుకు రాశాడు.

వాణ్ణేం చెయ్యగలిగేరు మీరు?

అటు చూళ్ళేదంటారు, ఎలా నమ్మడం ఆ మాట?

చూడకపోతే ఎందుకు చూళ్లేదు, అది మీ విధి నిర్వహణ లోపం కాదా? అసలు చూడ్డానికి మీకు ధైర్యం ఉందా?

ఆ పక్క రూంలో యిన్విజిలేటర్సు ఆన్సర్సు డిక్టేటు చేశారుట!

మా అందరి ఆన్సర్సు పేపర్సూ ఒకరే దిద్దుతారు.

మా భవిష్యత్తులో జరగబోయే యీ తేడాలకీ, అన్యాయాలకీ జవాబుదారీ ఎవరు?

దొరికినవాడే దొంగ.

దొరక్కుండా అన్ని ఏర్పాట్లూ చేసుకునే దొంగ దొర!

నేరాలు చేసినవాళ్ళని శిక్షించడం చేతకాక, పొరపాట్లు చేసిన వాళ్ళమీద పగ తీర్చుకుంటారు మీరు.

నేను కాపీ చేశాననీ, తప్పు చేశాననీ రిపోర్టు చేశారు మీరు.

డిబారు చేశారు నన్ను

చేజేతులా ఒక విద్యార్థి జీవితం నాశనం చేసిన గురువులు మీరు;

మిమ్మల్ని ఏమనాలో తెలియడంలేదు నాకు.

ఎలా అర్థం చేసుకోవాలో అంతకంటే బోధపడ్డంలేదు నాకు.

ఆఖర్న ఒక్క మాట మేష్టారూ! ఒక ఏడాదే నాచదువు ఆగిపోయేది. ఒక ఏడాదితో నా శిక్ష పూర్తి అయిపోయింది.

కాని ఏడాది ఏడాదీ యీ శిక్ష మీకు పడుతూనే ఉంటుంది.

అందర్నీ ఒకలా చూడలేని, అన్ని పరిస్థితుల్లో ఒకేలాగ ప్రవర్తించలేని మీ అసమర్థత ఎల్లకాలం మిమ్మల్ని వేధించక మానదు.

నాకు కాదు, మీరు జవాబు చెప్పవలసింది.

దీనికి మీకు మీరేం జవాబు చెప్పుకుంటారు?!

★